సహగమనం

1

పేరు చదవగానే నామీద విరుచుకుపడకండి, ఈయన ఈ దురాచారాన్ని ఈ శతాబ్దంలో ప్రచారం చేస్తున్నాడేమిటా? అని. కథంతా పూర్తిగా చదివినా, ఆగ్రహం పోకపోతే, నాదే తప్పని నేనే వొప్పుకుంటాను.

ఐరనీగ్రేసుని ఎరగనివాళ్లెవరూవుండరు, మా కాలేజీలో పదేళ్ళు, ఈమధ్య చదివిన వాళ్లు. పేరుకుతగిన గ్రేసూ, అందం; అల్లరి విద్యార్థులకు తగిన యిసుప (తెరనీ) తత్వం అన్నీ ఆవిడకి పలుకుబడిని తెచ్చాయి.

తురంగరావెప్పుడో ఆవిడమీద మనసుంచాడు. కాని ఎదురుకుండా వెళ్లి 'నన్ను పెళ్లిచేసుకో; నా సర్వస్వాన్నీ నీకర్పిస్తాను' అనే ధైర్యం అతనికి లేదు; వేరేవిధంగానూ, తన ప్రేమని ఆవిడకి వెల్లడించలేకపోయాడు. తక్కిన విద్యార్థుల్లా అల్లరి మొదలెడితే చులకనగా చూసి ద్వేషిస్తుందేమోనని భయపడసాగాడు.

ఒకరోజున గ్రేసు మేడమెట్లమీద పైకివొస్తోంది. అతనూ అనాలోచితంగా వొచ్చినట్టు వెనకాల పడ్డాడు. తెల్లని చీర, పొడుగాటి జెడ, రెండు చామంతిపువ్వులు, నల్లని సిల్కు రిబ్బను! అతని మనస్సు చలించింది. జడ పట్టుకుని కిందికి లాగాడు.

గ్రేసు ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. అతను న్యాయాధిపతి ముందు నిలుచున్న నేరస్తుడిలా బిక్కమొహంతో చూశాడు. ఇంకా, కిందనించి వొచ్చే లెక్చరర్‌ని ఆవిడ చూసింది. మాట్లాడకండా ఆడపిల్లల గదిలోకి పోయింది.

తర్వాత లెక్చర్‌ని చూసిన తురంగరావుకు గుండె దడపట్టుకుంది. ఎందుకో జ్వరం తగిలినట్టయింది. క్లాసురూంలో ఏదో బాధపడుతూ కూచున్నాడు. కాని ఒకందుకు అతనికి సంతోషంగా వుంది. గ్రేసు కసరలేదు; తిట్టాలేదు. కాని ఆచూపు అర్థంకాలేదు.

లెక్చరర్ ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో ఈవార్త కాలేజీ అంతా వ్యాపించింది. కొందరు విద్యార్థులు, అతన్ని నేరస్థునిలాగా, కొందరు హీరోలాగా చూడసాగారు. ఇతన్ని సస్పెండ్

చేస్తారనీ, డిస్మిస్ చేస్తారనీ, టి.సి. ఇచ్చి పంపిస్తారనీ అందరూ, అన్నివిధాలా అనుకోసాగారు. అన్నీ విన్నాక తురంగరావు చెడ్డకే తయారయ్యాడు.

ప్రిన్సిపాల్ తురంగరావుకీ, ఐరనీగ్రేసుకీ కబురంపాడు. లెక్చరర్ కూడా అక్కడే వున్నాడు.

"ఈ అబ్బాయి నీ జడ లాగాడా?"

ప్రిన్సిపాల్ అడిగాడు. గ్రేస్ ఒకసారి ఆలోచించింది. అతని ముఖంలోకి చూసింది. తర్వాత లెక్చరర్నీ, ప్రిన్సిపాల్నీ చూసింది. కాని ఏం మాట్లాడ్లేదు.

"ఏం? చెప్పవేం?"

ప్రిన్సిపాల్ రెట్టించాడు.

"లేదు" అంది గ్రేసు; ఒక విద్యార్థి భవిష్యత్ కోసం చిన్న అబద్ధం ఆడింది.

"అబద్ధం చెప్పకు; నేను నా కళ్ళతో చూశాను" అన్నాడు లెక్చరర్.

"మీరేం చూసి ఏమనుకున్నారో, ఈ సంగతిమాత్రం శుద్ధ అబద్ధం" అంది గ్రేసు మళ్ళీ.

లెక్చరర్ ముఖం మాడింది.

ప్రిన్సిపాల్ "ఏమండీ, చత్వారంకాని రాలేదుకదా?" అని, వాళ్ళతో "మీరు క్లాసులకి వెళ్ళొచ్చు" అన్నాడు. తర్వాత ఆయన్ని బాగా దులిపాడుట.

2

కాలేజీ వదిలిపెట్టేక ఇంటికి వెడుతో, చాలాదూరంవరకూ తన్ను తురంగరావు అనుసరిస్తున్నది గ్రేస్ గుర్తించనేలేదు. తర్వాత అతనొక చిన్న దగ్గు దగ్గాడు. ఆవిడ వెనక్కి చూసింది.

"ఎవరూ? మీరా?' అంది చిరునవ్వు నవ్వుతూ. వాళ్ల ఇల్లు వొచ్చింది అంతలోకి.

"మీ సహాయం...!" అని తురంగరావు ఏదో చెప్పబోయాడు.

"లోపలికి రండి" అంది గ్రేస్. అతనికి అర్థం కాలేదు. కాని అతను బదులు చెప్పక అనుసరించాడు.

చిన్నయిల్లు! ముందర వరండా కర్రల కటకటాలతో వుంది. రెండు ఫేముకుర్చీలు, చిన్న టేబిల్, ఎదురుగుండా షెల్ఫ్‌లో పుస్తకాలు, ఇల్లు చాలా పరిశుభ్రంగా వుంది. బయట చిన్న పువ్వులతోట వుంది క్రిష్టియన్‌ఫాషన్‌లో.

ఇద్దరూ కుర్చీలో కూచున్నారు.

"మధ్యాహ్నం ఎందుకలా చేశారు?" ఐరనీగ్రేస్ అడిగింది. అతను దీనంగా చూడసాగాడు. ఆమెమళ్ళీ, "కింద లెక్చరర్ వొస్తున్నాడని వూరుకున్నాను. కాని లేకపోతే..."ఏమో అనబోయింది.

"నాకు తెల్సు. మిమ్మల్ని కాలేజీలో చేరినదగ్గర్నించీ చూస్తున్నాను. నాకు ఏదో అగాధమైన ప్రేమకలిగింది, మీమీద! క్లాసులో మీకేసే చూస్తుంటాను. మీకు తెలీయకుండా, సామీప్యంనించి మిమ్మల్ని గమనించడానికని, చాలాసార్లు కావాలని నడిచాను. మీతో చాలాసార్లు మీ యింటివరకూ కూడా నడిచాను. కాని నా ప్రేమాప్రయత్నం మీ దృష్టిని ఆకర్షించలేకపోయాయి. ఈ వేళ ఎందుకనో తెలీదు. నన్ను నేనే మర్చిపోయాను. మిమ్మల్ని తాకుతే జీవితాని కదే చాలేమో ననిపించింది..." అతనికి ఆవేశంలో గొంతు పూడిపోయింది. తక్కింది కళ్లతో చెప్పాడు.

ఐరనీగ్రేస్‌కి మొదట నవ్వువొచ్చింది కాని తర్వాత అతని ఆవేశాన్ని గుర్తించింది. అతను మౌనంగా కళ్ళతో ప్రేమని కురిపిస్తున్నాడు. "మగవాళ్లు, పాపం, ప్రేమ ఎక్కువైనప్పుడు ఇల్లాగే పిచ్చిపాపలైపోతారు" సానుభూతితో నవ్వింది.

అతనేం మాట్లాడ్లేదు, 'నువ్వేమన్నా అనుకో, నాకు కావల్సింది, నీ ప్రేమమాత్రం' అనుకుని.

గ్రేసు తల్లి రెండు కప్పులు టీ యిచ్చింది. మళ్లీ లోపలపనిలోకి పోయింది.

టీ తాగాక, గ్రేసు అంది: "నాకు పిచ్చి ప్రేమల్లో నమ్మకంలేదు; చేసుకుంటే పెళ్ళి చేసుకోవాలి, అంతే!"

అతని ముఖాన్ని పరిశీలనగా చూడసాగింది. అతని ముఖం విప్పారింది. సంతోషంతో కళ్లు నాట్యం చేయసాగాయి!

"అబ్బ! నా జన్మ తరించింది. ఇంక నాకు జీవితంలో కావల్సిందేమీలేదు. ప్రేమ ఫలించింది" అరిచాడు.

ఐరనీగ్రేస్ అందుకుంది: "మన సమాజాన్ని, అందులో మా సమాజాన్ని కొంచెంగుర్తుకు తెచ్చుకోండి. మీరేమో ఉత్తమకులస్థులు. మేం అదోజాతి. మిమ్మల్ని, మీకుటుంబాన్ని వెలివేస్తారు. మిమ్మల్ని ఇంటినుంచి తరిమేస్తారు, ఈ భౌతికబాధల్ని భరించలేక మీరు కొన్నాళ్లు పోయాక వేరేదారి తొక్కుతారు. నేను నమ్మలేను-మనం సంతోషమైన జీవితం గడుపుతామని! ఇలాంటి ప్రేమలుకల్సి, జయించి సుఖంగా వున్న వ్యక్తులు ఏకోటిలో ఒక్కరో" అంది.

అవును; ఆవిడ చెప్పినదాంట్లో అబద్ధంలేదు. మనదేశంలో వివాహాలు జరిగేది ప్రేమనిబట్టికాదు; పెద్దలనిశ్చయాన్ని బట్టి గాని, ఒకవేళ ఎవరైనా ఈ సంఘదుర న్యాయానికి ఎదురు తిరిగి ప్రేమికులైతే వాళ్లని నానాహింసలూ పెట్టడానికి చూస్తారు. సంస్కారులమని చాటుకునే పెద్దమనుషులతో సహా.

అతను లేచి రెండు చేతులూ పట్టుకుని అనసాగాడు. "నన్ను నమ్ము, ఈ వేళనించి నేను ఇక్కడేవుంటాను, నాయింటికేపోను. అప్పుడైనా నమ్మకం కలుగుతుందా? తర్వాత మా

ఇంటివైపునించివొచ్చే ఎటువంటి ప్రతిఘటనైనా నేను ఎదుర్కొంటాను. లేకపోతే వాళ్లతో సంబంధమే వుండదు. ఇంతచదువు చదివినమనం సుఖంగావుండలేకపోం. ఎక్కడో ఏదో వుద్యోగం చేసుకుని హాయిగా వుందాం. నామాటను నమ్ము. అతని కళ్లల్లో ఆనందబాష్పాలు: ఐరనీగ్రేసుకీ అంతే! మాటరాలేదు.

తల్లివొచ్చి గుమ్మందగ్గర నుంచుంది.

"మీ అల్లుడు!" అని ఐరనీ గ్రేసు, అతన్ని లేవతీసి, తల్లికిచూపింది.

తల్లిముక్కుమీద వేలేసుకుంది, వాళ్ళిద్దరూ ఆమెకి నమస్కరించారు, ఆశీర్వదించమని.

3

ఇది జరిగిన రెండేళ్లలో వాళ్లజీవితంలో చాలామార్పులు జరిగాయి. కాని తురంగరావు ఆమెని విడవలేదు. గ్రేసు అతన్ని అంతకంటె రెట్టింపు ప్రేమతోనూ చూసుకుంది. తల్లిమాత్రం చనిపోయింది.

కాని బాహ్యపరిస్థితులు వాళ్లకి చాలా వ్యతిరేకమయ్యాయి. అతనితల్లీ, తండ్రీ ఐరనీ గ్రేసు ఇంటికి వూళ్లోనిపెద్దమనుష్యుల్ని తీసుకొచ్చి 'అతనికీ, ఆమెకీ' బుద్ధిచెప్పించడానికి, అతన్ని తీసుకువెళ్లడానికీ ప్రయత్నించారు. కాని అతను లొంగలేదు. తండ్రి "ఆస్థిఇవ్వ"నని బెదిరించాడు.

"కూడా స్వర్గానికి తీసుకెళ్లు!" అన్నాడు కొడుకు. "రాకపోతే ఉరిపోసుకు చస్తానంది" తల్లి.

"మమ్మల్నిద్దర్నీ రానియి" అన్నాడు కొడుకు.

"ఆ కిరస్థానీదాన్ని నా గడపతొక్కనియ్యను" అన్నాడు తండ్రి.

"మీ ప్రేమకి కులాలు, మతాలున్నాయి. మాప్రేమకి లేవు. మమ్మల్ని సుఖంగా బ్రతకనియ్యండి" అన్నాడు కొడుకు.

ఐరనీగ్రేసుకీ వాళ్లమతంలోంచి వొత్తిడి వొచ్చింది.

"అతన్ని కూడా క్రిష్టియనిమతం తీసుకోమను" అన్నారు మతాధిపతులు.

"ప్రేమకీ, మతానికీ సంబంధం ఏమిటి?" అంది గ్రేసు; "మతం వ్యక్తిగతవిషయం"

అతనితండ్రి డబ్బునీ, పలుకుబడినీ వినియోగించి మతాధిపతుల్ని ఇంకా రెచ్చగొట్టాడు. చివరికి ఇంటివాళ్లుకూడా:" ఈ సంకరపు కాపరాలు' మాకుపనికిరా"వన్నారు; వెళ్లగొట్టారు!

ఇద్దరూ ఒకరోజున ఆవూరువిడిచి దూరంగా వేరేపల్లెటూరు పోయారు. అక్కడ అతను ఒకసినిమాహాల్లో చేరాడు. గ్రేస్ చేతిమిషన్‌మీద గలేబులూ, అవీకుట్టి రెడీమేడ్‌వాళ్లకి అమ్మేది. అతనికి రాత్రి ఆరు గంటలూ, తర్వాత పగలు రెండు గంటలూ పనివుండేది. తీరికకాలంలో ఎంతోహాయిగా గడుపుతుండేవారు.

ఒకరోజు గ్రేసు ఏదో అల్లికలల్లుతోంది. తురంగరావు వెనకనించి వొచ్చి, జడలాగాడు. ఆవిడ వెనక్కి తిరిగింది. ముఖం కత్తివేటుకు నెత్తురుచుక్క లేకండా అయింది! కుర్చీలోంచి లేచింది! అతనూ వెనక్కి తిరిగాడు. ఊపిరి ఆగినట్టయింది!

గుమ్మంలో లెక్చరర్! ఇద్దరూ ఒక క్షణం అయ్యాక తేరుకున్నారు. కాని ఆయనే ముందు మాట్లాడాడు.

"నన్ను చూసి భయపడకండి. అసలు మాదీవూరే! ఏదో శిస్తులకని వొచ్చాను. నిన్న సినిమాహాల్లో తురంగరావుని చూశాను. అప్పుడే పలకరిద్దామనుకొన్నాను. కాని కుదరలేదు. ఇప్పుడు బజార్లో కనపడితే వెనకాల వొచ్చాను" అంటూ లోపలకొచ్చాడు.

తురంగరావు "రండి, కూచోండి" అని ఆహ్వానించాడు. గ్రేసు లోపలికి వెళ్లింది.

ఆయన కూచున్నాడు. "మీలాంటి ప్రేమైకజీవుల్ని ఎక్కడా చూడలేదు. ఏం పట్టుదలా, దీక్షా..."

తురంగరావు పైకి చిరునవ్వు నవ్వాడు. లోపల అగ్ని రగుల్తోంది.

"షేక్స్పియర్ బతికుంటే మీ ప్రేమగాథని ఓ గొప్ప నాటకంగా రాసేవాడు."

తురంగరావు "ఏదో ప్రేమచేత అలా అంటున్నారు" అన్నాడు.

ఐరనీగ్రేస్ టీ తెచ్చింది. కాని ఆయన కృతజ్ఞత తెల్పుతూ స్వీకరించలేదు. తర్వాత వెళ్లడానికి లేచాడు.

"మీకు శుభం కలుగుతుందని ఆశిస్తున్నాను" అని వెళ్లాడు ఆయన.

"అశుభం కాకండావుంటే బ్రహ్మదేవుడికి వెయ్యి నమస్కారాలు" అనుకున్నాడు లోపల తురంగరావు.

ఐరనీ గ్రేసు అంది: "ఈ దొంగముండాకొడుకు ఇక్కడ దాపరించాడు. ఏం చెయ్యదుకద!"

"ఏం చేస్తాడు? మన్ని ఇన్నాళ్ళనించీ ఎరిగున్నవాళ్లు ఇవాళ ఇతను చెబితే ద్రోహంచేస్తారా?" గుడ్డినమ్మకంతో ఏదో అన్నాడు కాని అతనికీ లోపల బెంగగానే వుంది.

ఎందుకు చెయ్యదు? ప్రిన్సిపాల్చేత మొహం మాడిపించిందిగా! ఆవూళ్లో ఆయనకి పలుకుబడికూడా వుంది! వాళ్లు ఆవూళ్లో ఎవరోకమ్మ వారింట్లో ఉంటున్నారు. ఆయనికివాళ్ల చెవులో వీళ్లు సంకరపుపెళ్లి బాపతు' అని వూదాడు. కమ్మాయన పాలేరుచేత కబురంపాడు రాత్రికిరాత్రి ఇల్లు ఖాళీ చెయ్యాలని. అతను సినిమాదగ్గరున్నాడు. ఆపాలేరుచేత గ్రేసు తురంగరావుకి కబురుచేసింది.

"లెక్చరరీ పుణ్యంకట్టుకున్నాడని" అతను యజమానికి చెప్పకుండా, రోజుకుంటూ వొచ్చాడు.

ఈపాటికి కమ్మరైతుకూడా వొచ్చాడు అక్కడికి.

"రేపు ఖాళీచేస్తాం, ఈ రాత్రికి వుండనివ్వండి" అన్నాడు తురంగరావు.

"వీల్లేదు, బాపనోడూ, కిరస్తానిదీ, భలే కాపరం చట్టబండలైనట్టే వుంది. నాకిన్నాళ్లూ తెల్లేదు– లేకపోతే పాలేర్లచేత బయట పారేయిస్తా" గట్టిగా అరిచాడు.

వాళ్ళిద్దరూ ఆ లెక్చరరీని ఎంతశపించుకున్నారో లోపల.

తురంగరావుకి కళ్ళనీళ్లు తిరిగాయి. ఐరనీగ్రేసుకీ అంతే! "నిశ్చల ప్రేమకి లోకంలో చోటులేదు; ఎప్పుడు కులాలూ, మతాలూ, కుళ్ళూ కంపూ" అనుకుంది లోపల. బాధతో, అవమానంతో కళ్ళవెంబడి నీళ్లు కారుతూనే వున్నాయి. తురంగరావుకి అవి కనపడకుండా ఒకసారి తుడుచుకుంది.

సామానులన్నీ బయటపెట్టారు. ఆ చుట్టు పక్కలుండరాదని గదమాయించాడు మళ్ళా ఆ రైతు; తనచుట్టూ మూగినచాలా మంది ఆసటచూసుకుని.

"ఓ పెద్దమనుషులారా! మీరంతా రాక్షసులా, మనుషులా! ఈ లోకంలో ఒక మనిషి, స్త్రీ ప్రేమించుకుని భార్యాభర్తలుగా బతకడానికి వీలులేదా? దానికి కులాలు, మతాలు ఎందుకు? కులంలేని కులంమాది! మతంలేనిమతంమాది!! మమ్మల్నెందుకు చంపుకుతింటారు" అని గట్టిగా అరిచి కింద కూలబడ్డాడు తురంగరావు.

గ్రేసు అతనితలని ఒడిలోకి తీసుకుంది.

4

ఇలా సంఘంనించి తరమబడ్డ అతన్నీ, అతని భార్యనీ ఆ రైతు పాలేరే మాలగూడెంలో ఒక ఖాళీ గుడిసెలోకి చేర్చాడన్న సంగతి నేను వేరే చెప్పనక్కర్లేదు.

మామూలు లోకంలో వుండే పోరు వాళ్లకిక్కడ లేదు. పైగా అందరూ వాళ్లని గౌరవించేవారు. తర్వాత అతని సినిమాలో వుద్యోగం పోవడంకూడ ఆశ్చర్యకరమైన విషయం కాదు. అక్కడ కూలీలతో కష్టపడుతూ, వాళ్లకి రాత్రిళ్లు చదువు చెబుతూండేవాడు.

ఇలా నాలుగైదునెల్లు గడిచింది. ఇక్కడ ప్రేమని నమ్ముకుని సుఖంగా జీవించేవారు.

కాని అతను స్వతహాగా సుకుమారుడు. ఎండా, వానా ఎరక్కుండా పెరిగిన రకం. అలాంటిది మానసికంగా, భౌతికంగా అతనిమీద అతని ప్రేమనీ, వాళ్ల ప్రేమ విలువనీ తెల్సుకోకుండా కసి తీర్చుకున్నారు, అతన్ని మానసికంగా చంపి, భౌతికంగా బాధించి నీతినియమాల శాస్త్రవేత్తలూ, పెద్ద మనుషులూ.

ఈ మార్పులతో అతను జబ్బుపడ్డాడు. పది లంఖణాలుచేశాక కుళ్ళు సమాజాన్నీ, సంకుచిత నీతినియమాల లోకాన్ని విడిచి స్వేచ్ఛాజీవి అయ్యాడు.

ఐరనీగ్రేస్‌కి తెల్సు: జీవితంలో యిన్ని కష్టాలొస్తాయని. అయినా అతని ప్రేమని కాదనలేకపోయింది. ప్రేమకి, ప్రేమ ప్రతిఫలం కాకపోతే సంఘం చేసిన ద్రోహం తనే చేసినట్టె, అతనెప్పుడో మరణించి వుండునేమోనని ఆమె నమ్మకం.

చుట్టుపక్కలవాళ్లు అతన్ని స్మశానవాటికకు తీసుకువెళ్ళి, హిందూపద్ధతిలో తగులబెట్టారు, ఏటి వొడ్డున.

మంటల్లో భర్తని చూసి, మనసులో ఏసుని తల్చుకుంది గ్రేసు. అంతా వెళ్లాక నదిలోకి నడిచింది, పతిని అనుసరించడానికి. గంగ ఆహ్వానించింది. అంతే రెండు జీవితాల అంతం ఆవేళతో అయింది.

ముందరే చెప్పాను ఈకథపేరు సహగమనం అని–కాని సహదహనం కాదు, మీరు అనుకున్నట్టు.

క్షమించండి.

14.08.1951–ఆంధ్ర సచిత్ర వారపత్రిక